సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 30 । డిసెంబర్ । 2023



టీ-హబ్‌లో గిరిజన విద్యార్థినులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు శుక్రవారం హైదరాబాద్‌లోని టీ-హబ్‌ను సందర్శించారు.



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: తిప్పాపూర్‌లోని రాజన్న కోడెలను వరంగల్, జనగామ జిల్లాల్లోని గోశాలలకు 20 చొప్పున శుక్రవారం అందజేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.0/16.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

'కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి'



కలెక్టరేట్ ముందు కార్మికుల ధర్నా

సిరిసిల్లటౌన్: పార్కులు, డివైడర్లలో పనిచేసే గ్రీనరీ కార్మికులకు వేతనాలు ఇప్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. కలెక్టరేట్ ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేపట్టి, మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని పార్కులు, డివైడర్లలో 50 మంది గ్రీనరీ కార్మికులు పని చేస్తున్నారన్నారు. గ్రీనరీ నిర్వహణను బల్దియా కాంట్రాక్టర్లకు అప్పగించిందని, సదరు కాంట్రాక్టర్లు ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కలెక్టర్ కల్పించుకొని వేతనాలు ఇప్పించాలని కోరారు. ఎలిగేటి రాజశేఖర్, నర్సయ్య, శారద, శ్రీకాంత్, రాకేశ్, ఇంద్రవ్వ, మణెమ్మ పాల్గొన్నారు.

వేములవాడ కళాకారులకు పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న కళాకారులు

వేములవాడ: వేములవాడకు చెందిన పలువురు కళాకారులు పురస్కారాలు అందుకున్నారు. నెల్లూరు జిల్లాలో ఈనెల 28న కొవ్వూరుకు చెందిన సుమధుర నాట్యమండలి ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ కళాకారుల సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో సావనపెల్లి శ్రీనివాస్ దుర్యోధనుడి ఏకపాత్రాభినయం, ఎల్ల పోశెట్టి, కనపర్తి హన్మండ్లు, వారాల దేవయ్య, చిలుముల రమేశ్‌చారిలు బొబ్బిలి బ్రహ్మణ్ణ నాటిక, వనం రాజయ్య ఒగ్గు కథ ప్రదర్శనలు ఇచ్చారు. వీరి ప్రదర్శనకు మెచ్చి రూ.5వేల నగదుతోపాటు పురస్కారాలు అందజేశారు.

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి



సిరిసిల్లటౌన్: హైస్కూళ్లలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని తెలంగాణ గెజిటెడ్ హెచ్‌ఎం సంఘం జిల్లా అధ్యక్షురాలు అనురాధ కోరారు. ఈమేరకు శుక్రవారం డీఈవో రమేశ్‌కుమార్‌కు ఏడు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించి మాట్లాడారు. వేసవిలో పనిచేసిన వారికి సంపాదిత సెలవులు, సీనియారిటీ ప్రకారం విధులు కేటాయించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి మోతిలాల్, కోశాధికారి రాములు తదితరులు పాల్గొన్నారు.

గూడు గోడు



ఈ దంపతులు ఉజ్మా ఆఫ్రిన్, అన్వర్ హుస్సేన్. జిల్లా కేంద్రంలోని ధోబీగల్లీకి చెందిన వీరు ప్రతీ నెల రూ.3500 చెల్లిస్తూ అద్దె ఇంట్లో ఉంటున్నారు. అన్వర్ హుస్సేన్ ఆటో డ్రైవర్. డబుల్ బెడ్‌రూమ్ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. జాబితాలో పేరు రావడంతోపాటు డ్రాలో వీరికి ఇల్లు దక్కింది. శాంతినగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు వస్తుందని ఆశతో ఉండగా.. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఇళ్ల పంపిణీ నిలిచిపోయింది.



ఈమె సిరిసిల్లలోని గణేశ్ నగర్‌కు చెందిన గున్నాల కవిత. కవిత కూలీ పని చేస్తుంది. భర్త కృష్ణ నేత కార్మికుడు. సొంచాల మధ్యనే రెండేళ్ల కిందట గుండెపోటుతో మరణించాడు. కవిత 28 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటూ.. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకుంది. వితంతువుగా డబుల్ బెడ్‌రూమ్ ఇల్లుకు అర్హత సాధించింది. కానీ ఎన్నికల కోడ్ అమలుకావడంతో గూడు దక్కలేదు.



ఈమె సిరిసిల్లలోని నెహ్రూనగర్‌కు చెందిన గాజుల సువర్ణ. బీడీ కంపెనీలో పని చేస్తుంది. భర్త రాజు ఆటోడ్రైవర్. సొంతిల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లుపై ఆశతో రెండేళ్ల కిందట దరఖాస్తు చేసుకున్నారు. ఇళ్ల పంపిణీ ఆలస్యమైంది. ఎన్నికల కోడ్ రావడంతో సొంతింటి కల ఇంకా నెరవేరలేదు.

- ఎన్నికల కోడ్‌తో నిలిచిన ఇళ్ల పంపిణీ
- అధికారుల జాప్యం.. పేదలకు శాపం
- కళ్ల ముందే ఇళ్లు.. లబ్ధిదారులకు తప్పని అద్దె కష్టాలు
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం పేదల నిరీక్షణ



మున్సిపల్ ఆఫీస్‌కు వచ్చిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు

సిరిసిల్ల: సొంతింటి కల సాకారానికి నిరుపేదలకు ఎదురుచూపులు తప్పడం లేదు. అర్హతలు ఉండి.. జాబితాలో పేరు రాగా.. లక్కీ డ్రాలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు సైతం దక్కి.. పంపిణీ సమయంలో ఎన్నికల కోడ్ అమలుతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్లు అయ్యింది. ఫలితంగా ఏళ్ల ఎదురుచూపులు ఫలించలేదు. ఇప్పటికీ సిరిసిల్ల పట్టణంలో అన్ని అర్హతలు సాధించి ఎంపికైన 105 కుటుంబాలు అద్దె ఇళ్లలోనే ఉంటున్నాయి. ప్రతీ నెల అద్దె చెల్లిస్తూ భారంగా కాలం గడుపుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి నిరుపేదలు కష్టాలు అనుభవించాల్సి వస్తోంది.

204 డబుల్ ఇళ్లు.. 105 కుటుంబాలు

సిరిసిల్ల పట్టణ శివారులోని నర్సింగ్ కాలేజీ పక్కనే శాంతినగర్ వద్ద 204 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు సిద్ధమయ్యాయి. జిల్లా కేంద్రంలోని 105 పేద కుటుంబాలకు ఇక్కడ ఇళ్లు కేటాయించాలని మున్సిపల్ అధికారులు సిద్ధం చేశారు. మూడు విధాల వడబోత తర్వాత లబ్ధిదారులను ఎంపిక చేశారు. అందమైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీ సిద్ధమైంది. అందులో సిమెంట్‌రోడ్లు, తాగునీటి, మౌలిక వసతులు కల్పించారు. ఎన్నికల సమయంలో ఈ కాలనీలో బీఎస్‌ఎఫ్ పోలీసు బలగాలు బసచేశాయి. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు సిద్ధంగా ఉన్నా.. లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా నవంబర్‌లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇళ్ల పంపిణీ నిలిచిపోయింది. దీంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీ ఖాళీగా ఉండగా..



సిద్ధమైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

బాధితులు అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల జాప్యం.. పేదలకు శాపం

ఏళ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ సాగుతుండగా.. సిరిసిల్లలో మున్సిపల్ అధికారుల జాప్యం పేదలకు శాపంగా మారింది. మున్సిపల్‌లో రాజకీయ జోక్యం.. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకల నేపథ్యంలో ఏడాదిగా పలుమార్లు ఇళ్ల పంపిణీ వాయిదా పడింది. ఇలా శాంతినగర్‌లో 204 ఇళ్లు, రగుడు వద్ద 72 ఇళ్లు, పెద్దూరులో 504 ఇళ్లను పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందించలేకపోయారు. అన్ని అర్హతలు ఉన్న 105 మంది పేదలు మాత్రం అధికారుల చుట్టూ తిరుగుతూ.. ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మున్సిపల్ ఆఫీస్ ముందు ఆందోళన చేశారు. కానీ పేదల చిరకాల వాంఛ డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు దరి చేరడం లేదు.

గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది



శాంతినగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీ సిద్ధమైంది. 105 కుటుంబాలను ఎంపికచేశాం. పంపిణీకి సిద్ధంగా ఉండగా ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది. ప్రభుత్వం మారడంతో ఇప్పుడు గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చే వరకు ఏం చేయలేం.

– మీర్జా ఫసహత్ అలీబేగ్, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

ఎన్నికల ఖర్చుల వివరాలు అందించాలి

సిరిసిల్ల: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు తుది ఖర్చుల వివరాలు అందించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు జి.మణిగండసామి కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల అభ్యర్థుల ఖాతా రికన్సిలేషన్ నిర్వహించారు. మణిగండసామి మాట్లాడుతూ అభ్యర్థుల తుది ఖర్చులకు సంబంధించి అభ్యంతరాలు, తేడాలు ఉంటే జిల్లా వ్యయ మానిటరింగ్ కమిటీని సంప్రదించాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ అభ్యర్థులు జనవరి 2లోగా తుది ఖర్చుల వివరాలను నిర్ణీత ఫార్మాట్‌లో సమర్పించాలని సూచించారు. ఒకవేళ వివరాలు సమర్పించకపోతే తర్వాత ఎన్నికల్లో పోటీకి అనర్హులు అవుతారని స్పష్టం చేశారు. వేములవాడ ఆర్డీవో మధుసూదన్, ఎన్నికల వ్యయ ప్రత్యేకాధికారి స్వప్న, నోడల్ అధికారి రామకృష్ణ, ఎన్నికల అకౌంటింగ్ టీమ్ పాల్గొన్నారు.



లెక్కల వివరాలు అందిస్తున్న ప్రతినిధి

జిల్లాలో 17,540 దరఖాస్తులు

- ప్రజాపాలనకు వెల్లువలా దరఖాస్తులు

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 17,540 దరఖాస్తులు వచ్చాయి. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతోపాటు జిల్లాలోని 78 గ్రామాల్లో రెండో రోజు శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో 17,540 దరఖాస్తులను ప్రజలు సమర్పించారు. గురు, శుక్రవారాల్లో మొత్తం 28,222 దరఖాస్తులను ప్రజలు అధికారులకు అందించారు. ప్రజల నుంచి స్పందన బాగుంది.

ప్రజాపాలనతో పేదలకు చేయూత



సిరిసిల్లలో ప్రజాపాలనలో మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ఆరు గ్యారంటీలు అమలుచేస్తాం
- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: ఆర్థికంగా.. సామాజికంగా వెనుకబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళ, రైతు వర్గాలకు చేయూతనిచ్చేందుకే తమ ప్రభుత్వం ప్రజాపాలన చేపడుతుందని విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని 15వ వార్డులో శుక్రవారం ప్రజాపాలనను ప్రారంభించి మాట్లాడారు. ఎగువమానేరు ప్రాజెక్టుకు జలకల తీసుకొస్తామన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన స్థానిక మహిళలతో ఆది శ్రీనివాస్ కాసేపు మాట్లాడి, వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను ఇంటింటికి పంపేలా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. సిరిసిల్ల పట్టణంలో శుక్రవారం 4,232 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, స్థానిక వార్డు కౌన్సిలర్ ఆకునూరి విజయ నిర్మల, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, ఆకునూరి బాలరాజు, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్ పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారితో..

ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా విధులు నిర్వర్తించిన ఐఏఎస్ అధికారి మణిగండస్వామిని విప్ ఆది శ్రీనివాస్ కలిశారు. సిరిసిల్ల పీఆర్ గెస్ట్‌హౌస్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

అభివృద్ధిలో వివక్ష ఉండదు

అభివృద్ధిలో వివక్ష ఉండబోదని, అభివృద్ధి.. సంక్షేమ రెండు కళ్లలాగా ప్రభుత్వం చూస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సన్మానంలో పాల్గొని ప్రసంగించారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచుతానని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలను వంద రోజుల్లో అమలులోకి తెస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే రెండు హామీలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ తొమ్మిన్నర ఏళ్ల ప్రజావ్యతిరేక పాలన నుంచి ప్రజలు మార్పును కోరుకున్నారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, సూర దేవరాజు, సామల దేవదాస్, మ్యాన ప్రసాద్, గోలి వెంకటరమణ, ఆకునూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన ఉందాం

- కౌన్సిలర్లు జనంలోనే ఉండాలి
- కాంగ్రెస్ హామీల అమలుకు పోరాటం
- బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్



తెలంగాణ భవన్‌లో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల: అధికారంలో ఉన్నా.. లేకున్నా.. ప్రజల పక్షాన ఉందామని, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని తెలంగాణభవన్‌లో శుక్రవారం పార్టీ శ్రేణులు, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లతో మాట్లాడారు. అర్హులతో అన్ని పథకాలకు దరఖాస్తు చేయించాలన్నారు. కౌన్సిలర్లు జనంలోనే ఉండాలని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. సిరిసిల్లలోని విలీన గ్రామాలను తి రిగి గ్రామపంచాయతీలుగా చేయడానికి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మున్సిపల్ తీర్మానం చేస్తుందని తెలిపారు.

ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటుదాం

కొత్త సంవత్సరంలో నూతనోత్సాహంతో పనిచేద్దామని కేటీఆర్ పేర్కొన్నారు. అందరికీ అందుబాటులో ఉంటానని మరోసారి స్పష్టం చేశారు. ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటుకుందామని, అందుకు తగినట్లు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. సిరిసిల్ల పట్టణ ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ నాయకులు గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఈ ఏడాది పలు సంచలన సంఘటనలకు వేదికైంది. హత్య, ఆత్మహత్య, మిస్సింగ్, చోరీలు, కాల్పులు, టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ, అవినీతి, అరెస్టు, టీచర్ల బయోమెట్రిక్ దుమ్మా, తిరుపతికి ప్రయాణికుల ఇక్కట్లు.. ఇలా ఏ రకమైన వార్త తీసుకున్నా అది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వీటన్నింటిపై 'సాక్షి' దినపత్రిక స్పాట్ వార్తలతో పాటు ప్రత్యేక కథనాలు ప్రచురించింది. స్పందించిన ప్రభుత్వ యంత్రాంగం వెంటవెంటనే చర్యలు తీసుకుంది. పలు శాఖల అధికారుల అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించారు. బాధ్యులను విధుల నుంచి తప్పించారు. –సాక్షిప్రతినిధి, కరీంనగర్



అన్నీ సంచలనాలే...

2023 రివైండ్

- చోరీలు.. హత్య.. ఆత్మహత్యలు.. అవినీతి, అక్రమాలు
- 'టీఎస్‌పీఎస్సీ' కేసుకు కరీంనగర్‌కు లింకు
- పదోతరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో ఎంపీ సంజయ్ అరెస్టు
- రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఉమ్మడి జిల్లా ఘటనలు



జనవరి 1-2023: ఆత్మహత్యలు కావు హత్యలే.. గతేడాది కొత్త సంవత్సరం రోజున గంగాధరలో ఒకే కుటుంబంలో ఇద్దరు పిల్లలు, తల్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ మరణాల గుట్టు నూతన సంవత్సరం రోజునే వీడింది. తండ్రే తన పిల్లలకు, భార్యకు ఎస్ఏహెచ్ అనే రసాయనం కలిపి ఇచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తొలుత ఈ విషయాన్ని 'సాక్షి' వెల్లడించింది. ఆ తర్వాత నిందితుడు కూడా ఆత్మహత్య చేసుకోవడంతో కేసు మూసివేశారు.

ఫిబ్రవరి 24: కొండగట్టు ఆలయంలో బీదర్ దొంగల చోరీ.. ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆలయంలో బీదర్ నుంచి వచ్చిన దొంగలు చోరీ చేశారు. పలు వెండి ఆభరణాలు, తాపడాలను ఎత్తుకెళ్లారు. పోలీసులు 24 గంటల్లోనే కేసును ఛేదించడం గమనార్హం. ఈ విషయాన్ని కూడా 'సాక్షి' ముందుగానే ఎక్స్‌క్లూజివ్‌గా పాఠకులకు అందించింది.

మార్చి 16: టీచకుడు.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తోటి మహిళా టీచర్లను వేధిస్తున్న వైనాన్ని 'సాక్షి' బయటపెట్టింది. పకడ్బందీగా ఆయన వికృత చేష్టలను లోకానికి చూపించడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, సస్పెన్షన్ వేటు వేశారు.

10లో▸

క్లుప్తంగా

బిల్లులు చెల్లించాలి


వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మధ్యాహ్న భోజనం కార్మికుల బిల్లులు చెల్లించాలని ముస్తాబాద్ మండల వనరుల కేంద్రంలో శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఏడు నెలలుగా కోడిగుడ్ల బిల్లులు రాక అప్పులు చేశామన్నారు. వేతనాలు, ఇతర బిల్లులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

లైంగికదాడి కేసులో ఒకరికి జైలు

వేములవాడ: మానసిక వికలాంగురాలిపై లైంగికదాడికి పాల్పడ్డ బుక్క రాంచంద్రం(55)కు రెండేళ్ల జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ వేములవాడ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ ప్రవీణ్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు. రుద్రంగికి చెందిన ఓ దంపతులకు నలుగురు సంతానం. వీరిలో ముగ్గురికి పెళ్లిళ్లు కాగా.. చిన్నకూతురు మానసిక వికలాంగురాలు. ఆరోగ్యం సరిగ్గా లేని యువతి(27)కి పెళ్లి కాకపోవడంతో ఇంటి వద్దనే ఉంటుంది. 2018 ఫిబ్రవరి 2న తల్లిదండ్రులు బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లగా ఒంటరిగా ఉన్న యువతిపై అదే ప్రాంతానికి చెందిన బుక్క రాంచంద్రం అలియాస్ రాములు(55) లైంగికదాడికి పాల్పడ్డాడు. యువతి అరుపులు, కేకలు వేయడంతో రాంచంద్రం పరారయ్యాడు. ఈ సంఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదుతో రుద్రంగి ఎస్సై విద్యాసాగర్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో సాక్షులను వేములవాడ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విక్రాంత్ కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడు రాంచంద్రంకు జైలు, జరిమానా విధించినట్లు ఏపీపీ విక్రాంత్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప మాలధారులకు గాయాలు


గాయపడ్డ మాలధారుడు

వేములవాడ: వేములవాడకు చెందిన అయ్యప్ప మాలధారులు కారులో శబరిమల వెళ్తుండగా ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం సమీపంలో ప్రమాదానికి గురైనట్లు బంధువుల ద్వారా తెలిసింది. అనంతపురం సమీపంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఉదయం పొగమంచు కురుస్తుండడంతో రోడ్డుపై ఉన్న జేసీబీ కనిపించక ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న పాశం భాస్కర్‌రెడ్డి, బాలు తీవ్రంగా, చిక్కుడు మల్లేశం, పిట్టల తిరుపతి స్వల్పంగా గాయపడ్డట్లు బంధువుల ద్వారా తెలిసింది. క్షతగాత్రులను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

సిరిసిల్లక్రైం: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు. సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన వాసం సత్యనారాయణ పదేళ్లుగా మూర్ఛ, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. అనేక విధాలుగా చికిత్స తీసుకున్న వ్యాధి నయం కాలేదు. మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లోని రేకులషెడ్ పైకప్పుకు ఉరివేసుకున్నాడు. మృతుని కుమారుడు వాసం శ్రీకాంత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

అన్నీ సంచలనాలే...

సాక్షిప్రతినిధి, కరీంనగర్

మార్చి 18: టీఎస్‌పీఎస్సీ కలకలం.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజశేఖర్‌రెడ్డిది జగిత్యాల జిల్లానే. దీంతో సిట్ బృందం పలుమార్లు జిల్లాకు వచ్చి విచారణ చేపట్టింది. కరీంనగర్ జిల్లాలోని బొమ్మకల్‌లోనూ లీకేజీకి లింకుందని గుర్తించారు. ఆ తర్వాత ఓ ప్రముఖ కాలేజీలో పని చేసే సిబ్బందిని కూడా ఈ కేసులో అరెస్టు చేశారు.

ఫిబ్రవరి 03-2023: తల్లీపిల్లలను కలిపిన సాక్షి.. కరీంనగర్ మంకమ్మతోట నుంచి ఓ మహిళ ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేసి, మహారాష్ట్ర తీసుకెళ్లింది. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో పోలీసులు ఆ పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించి, నిందితురాలిపై కేసు నమోదు చేశారు.

మార్చి 15: 'కట్టా'ను పట్టుకున్న సాక్షి.. నకిలీ అర్హతలతో 34 ఏళ్లుగా పంచాయతీరాజ్ శాఖలో కొలువు చేస్తున్న కట్టా విష్ణువర్దన్ అనే ఉద్యోగి నిర్వాకంపై 'సాక్షి' వరుస పరిశోధన కథనాలు వెలువరించింది. ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలు నిజమేనని తేల్చారు. అనంతరం సస్పెన్షన్ వేటు వేశారు.

ఏప్రిల్ 1: పోలీసులకు శాశ్వత ఫోన్ నంబర్.. పోలీసులందరికీ ఒకే శాశ్వత నంబర్‌ను కేటాయిస్తూ పోలీసు శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ విధానాన్ని కరీంనగర్ నుంచే అమలుకు నిర్ణయించింది. డిపార్ట్‌మెంట్‌లో చేరిన వ్యక్తి రిటైరయ్యే వరకు ఒకే నంబర్ ఉంటుంది. దాన్నే పీఎఫ్, బ్యాంకు ఖాతాలకు అనుసంధానిస్తారు.

ఏప్రిల్ 4: బండి సంజయ్ అరెస్టు.. పదోతరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో ఎంపీ బండి సంజయ్‌ను కరీంనగర్ పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేసి, హనుమకొండకు తరలించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో ఎంపీ సెల్‌ఫోన్ పోయింది. ఇంతవరకూ దొరకలేదు.

ఏప్రిల్ 20: మానకొండూర్‌లో కాల్పుల కలకలం.. మానకొండూర్ మండల కేంద్రంలో కాల్పులు జరిగాయన్న వార్త కలకలం రేపింది. అరుణ్ అనే యువకుడిపై గోదావరిఖనికి చెందిన సాయితేజ్, అతని మిత్రులు కలిసి హత్యాయత్నం చేశారు. నాటు తుపాకీతో కాల్చగా అది పేలలేదు. పోలీసులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

మే 24: నా కోడిని చంపేశారు.. తన టర్కీ కోడిని పొరుగింటి వ్యక్తి చంపాడంటూ ఓ వ్యక్తి కరీంనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, ఈ వార్త 'సాక్షి'లో ప్రముఖంగా ప్రచురించడం చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారింది.

జూన్ 27: ఉగ్రకేసులో తండ్రీకూతుళ్ల అరెస్టు.. ఉగ్రవాదులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో రామగుండంలో తలదాచుకున్న ఓ తండ్రీకూతుళ్లను ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. శ్రీనగర్‌కి చెందిన ఇస్లామిక్ స్టేట్ సానుభూతిపరులతో చాటింగ్ చేసినట్లు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. తండ్రి గతంలో హైదరాబాద్‌లో జరిగిన ఓ పేలుళ్ల కేసులో నిందితుడిగా ఉన్నాడని సమాచారం.



ఆగస్టు 14: బాలిక మృతి కేసులో కొత్త ట్విస్ట్.. పెద్దపల్లి శివారులో నివసించే మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ బాలిక గాయపడి, అనుమానాస్పద స్థితిలో మరణించడం కలకలం రేపింది. ఆమెపై సామూహిక లైంగిక దాడి జరిగిందన్న ఆరోపణలు వచ్చినా.. దర్యాప్తులో ఆత్మహత్య చేసుకుందని తెలియడంతో కేసు మిస్టరీ వీడింది.

జనవరి 05: సరసమైన ధరలకే విరాసత్.. గంగాధర మండల తహసీల్దార్ కార్యాలయంలో వారసత్వ భూములు విరాసత్ చేసే విషయంలో ఫోన్ పే ద్వారా రూ.లక్షల లంచాలు తీసుకున్నారు. అయినా పని చేయకపోవడంతో బాధితులు 'సాక్షి'ని ఆశ్రయించారు. ఈ వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకురావడంతో విచారణ జరిపిన కలెక్టర్ కార్యాలయం తహసీల్దార్‌ను బదిలీ చేసి, వీఆర్‌ఏ, వీఆర్వోలను సస్పెండ్ చేసింది.

జనవరి 21: పల్లెల్లో సహారా కలకలం.. అధిక వడ్డీ రేట్ల ఆశచూపి, డిపాజిట్లు సేకరించిన సహారా సంస్థ కస్టమర్లకు డబ్బులు తిరిగి చెల్లించడం లేదు. ఈ విషయం గోప్యంగా ఉంచి వారిని మభ్యపెడుతూ వస్తున్నారు. ఈ కుంభకోణం 'సాక్షి' పరిశోధనాత్మక కథనంతో వెలుగుచూసింది. డీజీపీ కార్యాలయం ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు రాష్ట్రంలో పలుచోట్ల కేసులు నమోదు చేసి, పలు కీలక దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు.

జూలై 03: దళితబంధులో మామూళ్ల పర్వం.. దళితబంధు పథకంలో మామూళ్ల పర్వంపై 'సాక్షి'లో ప్రచురితమైంది. దీనిపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు ఓ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. మరో ఉద్యోగి సస్పెన్షన్ భయంతో లీవు మీద వెళ్లారు.

జూలై 04: దుమ్మా మాస్టార్లు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీచర్లు బయోమెట్రిక్ ఉన్నా డుమ్మా కొడుతున్న వైనాన్ని 'సాక్షి' దుమ్మా మాస్టార్లు పేరిట కథనం ప్రచురించింది. దీనికి కరీంనగర్ డీఈవో స్పందించి, ఆలస్యమైతే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

సెప్టెంబర్ 08: రైతుబీమా ఐడీలలో జాప్యం.. రైతుబీమా, ఎల్‌ఐసీ ప్రీమియం పొందాలంటే ఐడీలు తప్పనిసరి. కానీ, ఈ-జెనరేట్ కాక పలువురు మరణించిన రైతుల కుటుంబాలకు బీమా జాప్యమైంది. విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో స్పందించిన వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించారు.



సెప్టెంబరు 20: స్పౌజ్ కోటా దుర్వినియోగం.. దంపతులిద్దరూ ప్రభుత్వ టీచర్లయితే ఒకేచోట పని చేసేందుకు ఉద్దేశించిన స్పౌజ్ కోటాను పలువురు టీచర్లు కేవలం హెచ్‌ఆర్‌ఏ కోసం దుర్వినియోగం చేశారు. ఈ విషయాన్ని 'సాక్షి' ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన విద్యాశాఖ వారిపై చర్యలు చేపట్టింది.

సెప్టెంబర్ 29: తప్పుడు ర్యాంకులతో పదోన్నతులు.. పదోన్నతులు, బదిలీల్లో టీచర్లు ర్యాంకులను తప్పుగా చూపించారు. 317 జీవో సమయంలో ఒకలా, ఇప్పుడు మరోలా చూపించిన వైనాన్ని 'సాక్షి' బట్టబయలు చేసింది. దీంతో స్పందించిన విద్యాశాఖ తప్పుడు ర్యాంకులతో పదోన్నతులు, బదిలీ చేయించుకున్న వారిపై చర్యలు చేపట్టింది.

అక్టోబర్ 31: కలెక్టర్ నివాసంలో చోరీ.. అక్టోబర్ 30న రాత్రి కరీంనగర్ కలెక్టర్ బి.గోపి నివాసంలో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఉప్పులూరుకు చెందిన పగిడిపల్లి ప్రసాద్ చోరబడ్డాడు. కలెక్టర్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్, చార్జర్, బ్యాగు, పెన్‌డ్రైవ్‌ను ఎత్తుకెళ్లాడు. పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. నవంబర్ 07న అతన్ని అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు.

జూలై19: పోలింగ్ కేంద్రాల సమస్యలపై జూలైలో 'సాక్షి' వరస కథనాలు ప్రచురించింది. స్పందించిన ఉన్నతాధికారులు తప్పులను సరిదిద్దారు. డిసెంబర్‌లో కొత్తపోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

డిసెంబర్ 22: తిరుపతికి ఇక వారానికి నాలుగు రైళ్లు.. కరీంనగర్ నుంచి తిరుపతికి వారానికి రెండు సార్లు ఉన్న బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ఇకపై నాలుగుసార్లు నడపాలని కేంద్రం నిర్ణయించింది. ప్రయాణికుల ఇక్కట్లపై 'సాక్షి' వరుస కథనాలకు స్పందించిన ఎంపీ బండి సంజయ్ సర్వీసుల సంఖ్య పెంచుతానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు.

డిసెంబర్ 27: ఎల్‌పీసీ సమర్పించాలి.. లాస్ట్ పేమెంట్ సర్టిఫికెట్ (ఎల్‌పీసీ) సమర్పించకుండానే పలువురు ఇంజినీర్లు కరీంనగర్‌లో ఉద్యోగం చేస్తున్న వైనంపై 'సాక్షి' ప్రచురించిన కథనానికి నగరపాలక కమిషనర్ స్పందించారు. అధికారులందరూ వెంటనే ఎల్‌పీసీ సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.




రాజన్నకు కోడె.. బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: సమ్మక్క జాతర భక్తుల రాకతో వేములవాడ రాజన్న క్షేత్రం రద్దీగా మారుతోంది. శుక్రవారం వేములవాడకు వచ్చిన భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసిన తర్వాత రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకొని, బద్దిపోచమ్మకు బోనం తీశారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాలి


వినతిపత్రం ఇస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

కరీంనగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2008లో నిర్వహించిన డీఎస్సీలో క్వాలిఫై అయినవారికి సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డికోరారు. 2008 డీఎస్సీ అభ్యర్థులు శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో చాడ వెంకటరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో 2008లో డీఎస్సీ నిర్వహించిందని, క్వాలిఫై అయిన వారికి అనివార్య కారణాల వల్ల ఉద్యోగాలు ఇవ్వలేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో సీఎం కేసీఆర్‌కు సమస్యను విన్నవించగా తప్పకుండా ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని అప్పటి విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి పెండింగ్‌లో పెట్టారని అన్నారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చి అండగా నిలిచారన్నారు. మన రాష్ట్రంలో హైకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ అభ్యర్థులకు తీరని అన్యాయం జరగడం బాధాకరమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మానవత్వంతో ఆలోచించి 2008 డీఎస్సీ క్వాలిఫై అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనకబడిన తరగతుల సంక్షేమ విద్యాశాఖల ఆధ్వర్యంలో ఇంగ్లిష్ మీడియంలో బోధనతో విజయవంతంగా నడుస్తున్న గురుకుల పాఠశాలల్లో 2024-2025 విద్యా సంవత్సరానికి 5వతరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజనల్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు రూ.100 రుసుము చెల్లించి 6 జనవరి 2024 లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు https-://tgcet.cgg.gov.in, https-://www. tswreis.ac.inను సంప్రదించాలని సూచించారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు


కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం కలిగోట గ్రామానికి చెందిన బొడ్డు హరీశ్‌ను హత్యాయత్నం కేసులో శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. హరీశ్‌కు తన తల్లి రాజవ్వ, సోదరి జవ్వాజి అనూషతో గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన హరీశ్ వారిపై కత్తితో దాడి చేశాడు. బొడ్డు రాజవ్వ ఫిర్యాదు మేరకు హరీశ్‌పై కేసు నమోదు చేసి శుక్రవారం రాత్రి అరెస్టు చేశామని ఎస్సై పేర్కొన్నారు.


పెద్దబోనాల బైపాస్ రోడ్డుపై..


రాజీవ్‌నగర్‌లోని గాంధీ విగ్రహం వద్ద ఉదయం 7:43 గంటలకు పొగమంచులో పనులకు వెళ్తున్న స్థానికులు


అంబికానగర్‌లో పొగమంచులో బీములు పోస్తున్న నేతకార్మికులు

మంచు దుప్పటి


పెద్దబోనాల బైపాస్‌లో ఉదయం 7:20 గంటలకు..

జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం 9 గంటలు దాటిన పొగమంచు దుప్పటి తొలగిపోవడం లేదు. మంచు కురుస్తున్నా సామాన్యులు మాత్రం వారి పనుల్లో నిమగ్నమయ్యారు. రైతులు వ్యవసాయ పనులకు.. విద్యార్థులు స్కూల్‌కు వెళ్తూ కనిపించారు. నేతకార్మికులు బీములు పోస్తుంటే.. మరో వైపు వాకర్స్ పొగమంచులోనూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు నడక మొదలుపెట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి


నాంపల్లిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

- అదనపు కలెక్టర్‌లు ఖీమ్యానాయక్, గౌతమి

సిరిసిల్ల/వేములవాడఅర్బన్/కోనరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలనిఅదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్, నాంపల్లిలో శుక్రవారం ప్రజాపాలన సభలు పరిశీలించారు. ప్రజాపాలన సభల్లో దరఖాస్తు ఇవ్వలేని వారు పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేసి రశీదులు పొందాలన్నారు. వేములవాడ తహసీల్దార్ మహేశ్, కౌన్సిలర్లు నీలం కళ్యాణి, జడల లక్ష్మి, నాయకులు జడల శ్రీనివాస్, నీలం శేఖర్, చిలివేరి శ్రీనివాస్, వాసాల శ్రీనివాస్, శ్రీనివాస్, గురువయ్య, సాగర్ పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి
– అదనపు కలెక్టర్ గౌతమి

అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ గౌతమి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని గోపాల్‌నగర్(19వ వార్డు), కోనరావుపేట మండలం ధర్మారంలో ప్రజాపాలన సభను పరిశీలించారు. గౌతమి మాట్లాడుతూ ప్రజాపాలన గురించి అందరికీ తెలియజేయాలని అధికారులకు సూచించారు. మహిళలు ఎక్కువగా ఉండడంతో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, డీఈఈ ప్రసాద్, టీపీవో అన్సార్, స్థానిక కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, ఎంపీవో రాజు, సర్పంచ్ గున్నాల అరుణ పాల్గొన్నారు.


గోపాల్‌నగర్‌లో ప్రజాపాలనను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గౌతమి

బాబుకు వైద్యసాయం చేయండి సారూ..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను వేడుకున్న ఓ తల్లి

సిరిసిల్ల: మా బాబు అందరిలాగే బడికి వెళ్లేవాడు.. ఆటల్లో.. చదువుల్లో ముందుండేవాడు.. అనుకోకుండా ఓ రోజు స్కూల్‌లో పడిపోయాడు. జ్ఞాపకశక్తిని కోల్పోయి.. ఎవరినీ గుర్తు పట్టడం లేదు.. హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్లాం.. వైద్య ఖర్చులకు రూ.10లక్షల వరకు అయింది.. మా ఆయన ప్రదీప్ డ్రైవర్‌గా పనిచేస్తాడు. మా బాబు రాపెల్లి నిహాల్(9)కు వైద్యం చేయించేందుకు ఆర్థిక స్తోమత లేదు.. అంటూ సిరిసిల్లకు చెందిన రాపెల్లి తేజశ్విని ఆవేదన వ్యక్తం చేసింది. సిరిసిల్ల టౌన్‌క్లబ్‌కు శుక్రవారం వచ్చిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముందు తన గోడు వెల్లబోసుకుంది. బాబు వైద్యానికి ప్రభుత్వపరంగా సాయం అందించాలని వేడుకుంది. బాబును బతికించుకునేందుకు ఆ తల్లి వేదనను అర్థం చేసుకుని ఆది శ్రీనివాస్ ఆదుకుంటామని భరోసానిచ్చారు. ప్రభుత్వపరంగా సాయం అందిస్తామన్నారు. ఈమేరకు తన పీఏ ద్వారా వివరాలు సేకరించారు. హైదరాబాద్‌లోని ప్రముఖ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించేలా ఓఎస్‌డీతో మాట్లాడారు.


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సమస్యను వివరిస్తున్న రాపెల్లి తేజశ్విని

స్కిల్ టైటాన్ గ్రాండ్ ఫినాలెలో మూడో స్థానం

కొత్తపల్లి(కరీంనగర్): పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న శుభశ్రీ సాహు శాస్త్రీయ ఆవిష్కరణలో భాగంగా ఓఎల్‌ఎల్ సీఎన్‌ఎన్ టీవీ 18 స్కిల్ టైటాన్స్-23 ఇటీవల ముంబైలో నిర్వహించిన స్కిల్ టైటాన్ గ్రాండ్ ఫినాలెలో మూడో స్థానంలో నిలిచి రూ.2లక్షల నగదు బహుమతి గెలుచుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం రితేష్ మెహతా తెలిపారు. ప్రధాని ఆర్థిక శాస్త్ర సలహా మండలి కన్సల్టెంట్ అపూర్వశర్మ చేతుల మీదుగా నగదు బహుమతి గెలుచుకోవడం గర్వంగా ఉందని చెప్పారు. శుభశ్రీ తన గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు నేతృత్వంలో పర్యావరణ అనుకూలమైన, మల్టిఫంక్షనల్, తక్కువ ధర, పోర్టబుల్ వ్యవసాయ యంత్రాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేసిందని తెలిపారు. ఈ యంత్రం నూర్పిడి, ధాన్యాన్ని వేరు చేయడం, గడ్డిని కత్తిరించడం, విన్నోవింగ్, బ్యాగ్ కుట్టడం వంటి నాలుగు వేర్వేరు కార్యకలాపాలతో పని చేస్తుందన్నారు. సౌర శక్తితో పని చేసే ఈ యంత్రానికి విద్యుత్ వినియోగం తగ్గనుందని చెప్పారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రాకేశ్, వి.యు.యం.ప్రసాద్, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ విద్యార్థిని అభినందించారు.



నగదు పురస్కారంతో శుభశ్రీ సాహు

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు

- అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

కరీంనగర్‌క్రైం: ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణకు తీసుకునే చర్యలపై శుక్రవారం కమిషనరేట్‌లోని జాన్‌విల్సన్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో 500 మంది ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్‌లైసెన్స్, ఆటోకు ధ్రువీకరణపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఆటో నడిపే సమయంలో యూనిఫామ్ ధరించాలని సూచించారు. ప్రయాణికులు తమ విలువైన వస్తువులను మరిచిపోతే సమీప పోలీస్‌స్టేషన్లలో అప్పగించి నిజాయితీ చాటుకోవాలన్నారు. ఏసీపీలు నరేందర్, కరుణాకర్‌రావు, సర్వర్, సీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐలు రమేశ్, ఖరీముల్లాఖాన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

హత్యకేసులో ముగ్గురికి జీవితఖైదు

జగిత్యాలక్రైం: జిల్లాలోని రాయికల్ మండలం కుర్మపల్లి గ్రామానికి చెందిన పుల్ల గంగమల్లయ్యను భూవివాదంలో హత్య చేసిన అదే గ్రామానికి చెందిన పుల్ల లస్మయ్య, పుల్ల మహేశ్, పుల్ల గంగవ్వకు జీవితఖైదుతో పాటు, ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పునిచ్చారు. కుర్మపల్లికి చెందిన పుల్ల గంగమల్లయ్య, లస్మయ్యల మధ్య కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఈ వివాదం కోర్టు పరిధిలో ఉండగా, 2019 జనవరి 19న పుల్ల గంగమల్లయ్య భూమిని జేసీబీతో పుల్ల లస్మయ్య, పుల్ల మహేశ్, పుల్ల గంగవ్వలు చదును చేస్తుండగా పుల్ల గంగమల్లయ్య, అతని తండ్రి పుల్ల పోశాలు అక్కడికి వెళ్లారు. అక్కడే ఉన్న ముగ్గురు వీరిద్దరిపై దాడులు చేయడంతో బలమైన గాయాలయ్యాయి. గంగమల్లయ్యను, పోశాలును ఆస్పత్రికి తరలిస్తుండగా గంగమల్లయ్య మార్గమధ్యలో మృతిచెందాడు. ఆయన భార్య పుల్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అప్పటి సీఐ రాజేశ్, కానిస్టేబుల్ కిరణ్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్‌లు సాక్ష్యులను ప్రవేశపెట్టగా, నిందితులకు జీవితకాలం జైలుశిక్షతో పాటు, ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

హత్యకేసులో మరొకరికి..

సారంగాపూర్‌కు చెందిన చెట్‌పల్లి లక్ష్మీరాజంను హత్య చేసిన అదే గ్రామానికి చెందిన సూర నీలయ్యకు జీవితఖైదు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పునిచ్చారు. సారంగాపూర్‌కు చెందిన చెట్‌పల్లి లక్ష్మీరాజం, సూర నీలయ్యల మధ్య వ్యవసాయ భూమికి వెళ్లే రహదారి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. లక్ష్మీరాజం తండ్రి చెట్‌పల్లి గంగయ్య అదే గ్రామానికి చెందిన అల్లెపు నర్సయ్యలు ఇద్దరు కలిసి వివాహ పత్రికలు పంపిణీ చేసేందుకు వెళ్తుండగా సూర నీలయ్య వాహనం తీసుకెళ్లారు. ఈ వాహనం రోడ్డు ప్రమాదానికి గురికావడంతో లక్ష్మీరాజం తండ్రి గంగయ్యకు గాయాలయ్యాయి. ఈ విషయంలో కూడా సూర నీలయ్య, లక్ష్మీరాజం మధ్య గొడవలు జరిగాయి. ఇది మనసులో పెట్టుకుని 2021 జనవరి 24న మధ్యాహ్నం సమయంలో తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్తుండగా సూర నీలయ్య గొడ్డలితో దాడి చేసి లక్ష్మీరాజంను హత్యచేశాడు. మృతుడి కొడుకు చెట్‌పల్లి తిరుపతి ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ సీఐ కృష్ణకుమార్ కేసు నమోదు చేసి సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా నిందితుడికి జీవిత ఖైదు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.